ప్రజాశక్తి

శనివారం 11 ఫిబ్రవరి 2023 5

పార్వతీపురం మన్యం



ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

నేషనల్ మీన్స్-కం- మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు హాజరైన విద్యార్థులు ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ తెలిపారు. ఈనెల 5న జరిగిన నేషనల్ మీన్స్-కం- మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఈనెల 20లోపు ఖచ్చితంగా వారి కుల, ఆదాయ, 7 వ తరగతి మార్కుల శాతం ధ్రువీకరణ పత్రాలు, అంగవైకల్యం ఉన్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. పత్రాల ధ్రువీకరణకు త్వరలో ప్రభుత్వ పరీక్షల కార్యాలయం నుంచి ప్రకటన వెలువడనుందన్నారు. ఈ ప్రకటనను కార్యాలయపు వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డిఇఒ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా సాధన కోసం

పోరాటాలకు సిద్ధం కావాల్సిందే

సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర విభజన సమయంలో ఎపికి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్‌లో చేసిన ప్రకటనను పెడచెవిన పెట్టి పార్లమెంటరీ విలువలను దిగజార్చి అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసగించిందని, రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలంతా ఏకమై ప్రత్యేక హోదా సాధనకు కోసం పోరాటాలకు సిద్ధపడాలని సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. ప్రత్యేక హెూదా సాధనకు ప్రజల కర్తవ్యాలపై శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, విద్యార్థి సంఘాలు నిర్వహించిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది తిమిడి జోగారావు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన అని, ఆ పక్షంలో వాటికోసం పోరాడడం ప్రజల నైతిక హక్కు అని తెలిపారు. ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ ప్రత్యేక హెూదా కోసం కృషి చేస్తున్న విద్యార్థి, యువజనులను చూసి రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలన్నీ మేల్కొనాలన్నారు. బ్రిటీష్ కాలం నాటి బానిస బతుకులు మళ్లీ భవిష్యత్తులో రానీయకుండా ఉద్యమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. తన కవితలు, పాటలతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.రామ్మోహన్ మాట్లాడుతూ భవిష్యత్తు యువతరమని, విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిజెపి పాలన పుణ్యమా అని ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఊడాయని విమర్శిం చారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా కుయత్తులాడుతుందని భవిష్యత్తులు తగిన బుద్ధి చెప్పేందుకు చలో పార్లమెంట్‌కు ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా సాధనకై సమర బస్సు యాత్ర అనేక నిర్బంధాలు, దాడులు ఎదుర్కొని జయప్రదమైంద న్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రాష్ట్రాన్ని మోసగించి దేశ సంపాదను కార్పొరేట్లకు ధారా దత్తం చేస్తూ ఇచ్చిన హామీని అమలు చేయాలని పోరాటం చేస్తున్న వారిపై రాజ దేశద్రోహం కేసులు పెడుతుం దని విమర్శించారు. బిజెపి పాలనలో రాష్ట్రంలో దేశీయ విశ్వవిద్యాలయాలు గానీ, వైద్య సంస్థలు గానీ, ఉపాధి అవకాశాలు నెలకొల్పే పరిశ్రమలు గానీ ఏర్పాటు చేయకుండా తీవ్ర ద్రోహం చేసిందని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఒకే మతం, ఒకే భాష, ఒకే దేశం పేరుతో దాడులు చేపడుతుందని, దీన్ని ఖండించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు జగదీష్, చిరంజీవి మాట్లాడు తూ నరేంద్ర మోడీ మెడలు వంచైనా ప్రత్యేక హెూదా సాధించాలని, మోడీ తీసుకొస్తున్న ప్రతి కర్తవ్యాన్ని రాష్ట్రంలో అమలు చేస్తుందని, దీన్ని ప్రజలంతా గమనించాలని అన్నారు. హోదా, విభజన హామీల సాధనకు విద్యార్థులు, యువకులు చేపడుతున్న పోరాటాల్లో తమ మద్దతు ఉంటుందన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు పి.రాజశేఖర్, ఎం.వెంకటరమణ మాట్లాడుతూ గిరిజన సెంట్రల్ మైనింగ్ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, విశాఖ రైల్వే జోన్ ప్రకటించాలని, విద్య, వైద్య సంస్థలు ఏర్పాటు చేయాలని, రాజధాని నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా, జనసేన జిల్లా కన్వీనర్ వంగల దాలినాయుడు, పిడిఎస్‌ఒ జిల్లా కన్వీనర్ సోమేశ్వరరావు తదితరులు తమ గళం వినిపిస్తూ విద్యార్థులు చేసే భవిష్యత్ పోరాటాలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. సదస్సు అనంతరం ప్రత్యేక హెూదా ఆంధ్రుల హక్కు అనే నినాదంతో వక్తలు, విద్యార్థులు, యువకులు అభివాదం చేస్తూ నినధిం చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్య దర్శి కె.రాజు, ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం, కె.భాస్కర్, గంగారావు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు

హెచ్‌ఎం, ఎండిఎం ఇన్‌ఛార్జి టీచర్ సస్పెన్షన్

- ఎండిఎం ఏజెన్సీ కూడా తొలగింపు
- ఎంఇఒకు షోకాజ్ నోటీస్
- కోన యుపి పాఠశాల ఘటనపై డిఇఒ కఠిన చర్యలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కోన యుపి పాఠశాలలో ఆహారం కలుషితమై జరిగిన తదనంతర పరిణామాలపై ఉన్నతాధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ కఠిన చర్యలు చేపట్టారు. శుక్రవారం స్థానిక ఎంఇఒ వి.మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం కోన యుపి పాఠశాలలో జరిగిన ఘటనలు ఆధారంగా ఆ పాఠశాల హెచ్‌ఎం పి.జయకుమార్, ఆరోజు మిడ్ డే మీల్స్ ఇన్చార్జిగా వ్యవహరించిన టీచర్ వి.సూరిబాబును సస్పెండ్ చేసినట్లు డిఇఒ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న ఏజెన్సీని రద్దు చేస్తున్నట్లు ఆదేశాలొచ్చాయన్నారు. కొత్త ఏజెన్సీను ఎండిఎం బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. అలాగే కొత్తగా డిప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను కూడా పాఠశాలకు నియమించారని ఎంఇఒ తెలిపారు.

ఎండిఎం పర్యవేక్షణకు రోజుకు ఒక టీచర్

ఇకపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం పరిశీలనకు స్థానిక పాఠశాల నుంచి రోజుకొక ఉపాధ్యాయుడ్ని నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఎండిఎం నిర్వహణపై ప్రతి పాఠశాలలోనూ ప్రత్యేక అవగాహన కార్యక్రమం కూడా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

కొత్త హెచ్‌ఎంగా జగదీష్‌కు బాధ్యతలు

కోన ప్రాథమిక పాఠశాల నూతన హెడ్మాస్టర్‌గా గణితం బోధకులు జగదీష్‌కు బాధ్యతలు అప్పగించనున్నట్లు ఎంఇఒ తెలిపారు. తాత్కాలికంగా పాఠశాల బాధ్యతలు నిర్వహణ ఆయన చేపడతారని తెలిపారు.

ఎంఇఒకు షోకాజ్ నోటీస్

కోన పాఠశాలలో జరిగిన సంఘటనకు సంబంధించి మండల విద్యాశాఖ అధికారి వి.మల్లేశ్వరరావుకు కూడా షోకాజ్ నోటీసును జిల్లా విద్యాశాఖ అధికారి జారీ చేసినట్లు తెలిసింది. దీనికి సంబంధించి సమగ్ర వివరణ ఇవ్వాలని కోరినట్లు తెలుస్తుంది. అలాగే పాఠశాలలో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలపై కూడా చర్యలు తీసుకోవడంలో విఫలమైన దానికి సంబంధించి కూడా ఆరా తీసినట్లు తెలుస్తోంది



డిఇఒ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జీతాల చెల్లింపులో జాప్యంపై

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపులో ప్రభుత్వం నెల నెలా కక్ష సాధింపుతో ఆలస్యంగా చెల్లింపులకు నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థాఽక విద్యాశాఖ కార్యాలయం ఎదుట మోకాలుపై నిలబడి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలకు సకాలంలో జీతాలు చెల్లించగా ఉపాధ్యాయులకు మాత్రమే ఆలస్యంగా చెల్లింపులు చేయడంపై దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని సకాలంలో ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, గోవిందమ్మ, కోశాధికారి మురళి, మండల నాయకఽలు వసంతనాయుడు, టి.శ్రీనివాస్, పి.వెంకటనాయుడు, వి.వెంకట రమణ, బి.పోలినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు అందించాలి : ఎమ్మెల్సీ

కురుపాం : ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఉపాధ్యాయ వ్యవస్థను గందరగోళంలోకి నెట్టిందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంబంధించి విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసిందని, ఆ క్యాలెండర్ ప్రకారం ఉపాధ్యాయుల జాబ్ చార్టును ప్రభుత్వం తీసుకెళ్లాల్సి ఉందని, కానీ ప్రభుత్వం మధ్యంతరంగా కొన్ని జీవోలను జారీ చేసి ఉపాధ్యాయ వ్యవస్థను గందరగోళానికి నెట్టిందని విమర్శించారు. 010 బడ్జెట్ ప్రకారం ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఇతర ఉద్యోగులకు ఒకటో తేదీ అయ్యేసరికి జీతాలు వేయాలని, కానీ ఈ ప్రభుత్వం ఎందుకు చిన్న చూపు చూస్తుందో అర్థం కావట్లేదని అన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పాఠశాలలను సందర్శించిన సమయంలో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని లోటుపాట్లు ఉంటే తెలియజేసి మందలించొచ్చు కానీ భయభ్రాంతులకు గురిచేయడం సమంజసం కాదని అన్నారు.

ఓవైపు పుట్టిపెరిగిన ఊళ్లు... మరోవైపు తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములు... జీవితాలతో పెనవేసుకుపోయిన చెట్టు, పుట్ట... ఇలా సర్వం వదిలి వెళ్లడమంటే ఆషామాషీ కాదు. తాజాగా ఉద్యోగాలు, ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తున్న వారి సంగతి కాస్త పక్కన పెడితే, కేవలం ఊరిని మాత్రమే నమ్ముకున్నవారు ఒకేసారి తెగదెంపులు చేసుకోవడం చిన్నవిషయం కాదు. అటువంటివారు శాశ్వతంగా ఊరు వదిలిపోవాలంటే గుండెలు బరువెక్కుతాయి. మనసు విలవిల్లాడుతుంది. ఇప్పుడు అటువంటి పరిస్థితే ఎదురైంది భోగాపురం మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలకు. భూముల కోసం అప్పుడు బుజ్జగించారు... ఇప్పుడు పొమ్మంటున్నారు. ఆగమేఘాలపై గ్రామాలు ఖాళీచేయాలంటూ అధికారులు ఆదేశాలు జారీచేయడంతో కన్నీటి పర్యంతమౌతున్నారు. వారి ఆవేదన, ఆక్రోశం ఆపడం ఎవరి తరమూ కావడం లేదు.



నిర్వాసితుల ఇళ్లను కూల్చివేస్తున్న జెసిబి

ఊళ్లు వదులుకోలేక..

ఇళ్లు కట్టుకోలేక

- అవస్థలు పడుతున్న ఎయిర్‌పోర్టు నిర్వాసితులు
- ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్న అధికారులు
- వలసకూలీల పరిస్థితి వర్ణనాతీతం
- యువతకు అందని ప్యాకేజీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పేరిట సుమారు 2700 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మరడపాలెం, బొల్లెంకులపాలెం, ముడసర్లపాలెం, రెల్లిపేట గ్రామాలను పూర్తిగా ఖాళీ చేయాల్సి వస్తోంది. చట్టప్రకారం భూములు, నష్టపరిహారంతో పాటు గ్రామస్తులందరికీ పునరావాసం కల్పించాలి. పునరావాస కాలనీల్లో అన్ని సదుపాయాలూ కల్పించాలి. 18 ఏళ్లు నిండిన వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీలు ఇవ్వాలి. ఇవేవీ పూర్తిచేయకుండానే అధికారులు గ్రామాలు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల ఆ గ్రామాలకు వెళ్లిన జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్యకళ రెండు రోజుల్లో ఖాళీచేయాలని, లేదంటే తామే ఇళ్లను కూల్చివేయాల్సి వస్తుందని ఆదేశించడంతో ఆయా గ్రామాల ప్రజానీకం బిక్కుబిక్కుమంటున్నారు. ప్రజావసరాల కోసం భూములు, ఊళ్లు త్యాగం చేస్తే మాకిచ్చిన గౌరవం ఇదేనా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు బందో బస్తు పెట్టిమరీ ఊళ్లు ఖాళీ చేయిస్తున్న నేపథ్యంలో నిర్వాసిత గ్రామాలు, గూడెపు వలస, లింగాలవలస నిర్వాసిత కాలనీల్లో 'ప్రజాశక్తి' పర్యటించింది. మరడపాలెంలో సుమారు 270 కుటుంబాలు ఉన్నాయని గ్రామస్తులతోపాటు స్థానిక సర్పంచ్ కొండపు కొత్తయ్యరెడ్డి చెప్పారు. అధికారులు గుర్తించినవి 240 కుటుంబాలు మాత్రమే. వీరికి లింగాలవలస సమీపంలోని నిర్వాసిత కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. మిగిలిన 30 మంది వలసకూలీలు కావడంతో వీరిని గుర్తించలేదు. కానీ, వీరికి గ్రామ కంఠంలోనే ఇళ్లు ఉన్నాయి. ఆయా ఇళ్లల్లో వృద్ధులు, పిల్లలు ఉంటున్నారు. ప్రస్తుతం గ్రామాలు ఖాళీచేయాల్సిన పరిస్థితి రావడంతో వారంతా ఎలా బతకాలో తెలియని పరిస్థితి. మిగిలిన వారి మాదిరిగానే తమకు కూడా 5 సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తే తలదాచుకుంటామని అధికారుల ఎదుట ప్రాథేయ పడుతున్నా సెంటున్నరకు మించి ఇవ్వబోమంటూ అధికార యంత్రాంగం చెబుతోంది. ఇక ఇళ్ల స్థలాలు పొందిన 240 మందిలో 117 మంది మాత్రమే నిర్మాణాలు ప్రారంభించగలిగారు. వీరిలో 17మంది మాత్రమే పూర్తిచేశారు. మిగిలినవన్నీ వివిధ స్థాయిలో ఉన్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. ఇళ్ల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం ఇస్తామన్న రూ.9.50 లక్షలు ఏడాది క్రితం ఇచ్చారు. దీంతో నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో నిర్మాణ వ్యయాలు పెరిగిపోయాయని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా నిర్మాణాలు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. తాగునీరు, విద్యుత్తు వంటి సదుపాయాలు కల్పించలేదని, పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలు కూడా అసంపూర్తిగా ఉన్నాయని, ఈ సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వానికే సమయం సరిపోకపోతే సొంతంగా ఇళ్లు నిర్మించుకోవానికి సమయం ఎలా సరిపోతుందని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. మరోవైపు చాలా నెలల క్రితమే విద్యుత్ లైన్లు అందుబాటులోకి వచ్చాయని, మీటర్లకు దరఖాస్తు చేసుకుని సమకూర్చు కోవాల్సిన బాధ్యత ప్రజలదేనని అధికారులు, వారి తరపున అధికార పార్టీ నాయులు చెబుతున్నారు. ఇలా ఇళ్ల నిర్మాణాలు అంపూర్తిగా ఉండడం, పునరావాస కాలనీలో సదుపాయాలు అంతంత మాత్రం కావడం వల్ల సమయం కోరుతున్నారు. తమకు స్థలాలే ఇవ్వకపోతే ఎక్కడ తలదాచు కోవాలంటూ వలసకార్మికులు ప్రశ్నిస్తు న్నారు. తమకు పూర్తిస్థాయిలో పరిహారం అంద లేదని రెల్లిపేట గ్రామస్తులు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీలు ఇవ్వలేదంటూ ఈ రెండు గ్రామాల్లోని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేశారు.

మరడపాలెంలో ఉద్రిక్తత

భోగాపురం : మండలంలోని కౌలువాడ పంచాయతీ లోని ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామం మరడపాలెం లో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. అధికారులు ఇళు కూల్చేందుకు సిద్ధం కాగా, స్థానికులు అడ్డుకున్నారు. పునరావాసం కల్పించిన చోట కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఎలా ఖాళీ చేసి వెళ్లేదని గ్రామస్తులు ప్రశ్నించారు. రెండు నెలల సమయం ఇవ్వాలని, తామంతా స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్ళిపోతామని చెప్పారు. దీనికి అధికారులు అంగీకరించలేదు. ఈలోగా అక్కడికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, జనసేన నియోజకవర్గ నాయకులు లోకం మాధవి, నాయకులు నిర్వాసితులకు మద్దతుగా నిలిచారు.



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు వినతిని అందజేస్తున్న వార్డు ప్రజాప్రతినిధులు

డంపింగ్ యార్డు తొలగించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

నగర పంచాయతీ డంపింగ్ యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 1, 2, 20 వార్డుల ప్రజలు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ డంపింగ్ యార్డ్ జనావాసాల మధ్య ఉండడంతో గత మూడేళ్లుగా డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసనతో పాటు చెత్తకు మంట పెట్టేయడం వల్ల వచ్చే పొగ వల్ల చుట్టుపక్కల సుమారు 10 వీధుల ప్రజలు తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నామని, పిల్లలు శ్వాస కోశ ఇబ్బందులకు, ప్రజలు వైరల్ జ్వరాల బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే డంపింగ్ యార్డ్ ఇక్కడి నుంచి తొలగించాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ సమస్యను పరిశీలించి త్వరలో శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డంపింగ్ యార్డ్‌కు సత్వర పరిష్కారం : ఎమ్మెల్సీ

పట్టణంలోని డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చేపడతామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని 1, 2, 3 వార్డులకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు శుక్రవారం ఎమ్మెల్సీ విక్రాంత్‌ను కలిసి స్థానికంగా ఉన్న డంపింగ్ యార్డ్‌తో పడుతున్న సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే కమిషనర్ సర్వేశ్వరరావును పిలిపించి సమస్య పరిష్కారానికి సూచనలు చేశారు. ముందుగా ఇక్కడ ఉన్న చెత్తను తరలించే ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. తాత్కాలికంగా రాజాం డంపింగ్ యార్డ్‌కు చెత్తను తరలించేందుకు చర్యలు చేపట్టారు. అట్టలి వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారం రోజుల్లోగా స్థానికంగా ఉన్న చెత్తను పూర్తిగా తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

ఆర్‌బికె వద్ద సిపిఎం, టిడిపి డిమాండ్

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రైతుల వద్ద కల్లాల్లో వద్ద నిల్వ ఉన్న ధాన్యం మొత్తం వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం, టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని డంగభద్ర రైతు భరోసా కేంద్రం వద్ద ఆ గ్రామ సర్పంచ్ జోగి భుజంగ నాయుడు, సిపిఎం నాయకులు కొల్లి గంగునాయుడు, కె.సీతారాం, టిడిపి నాయకులు శత్రుచర్ల పల్లవీరాజు ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేశారు. అనంతరం ఆర్‌బికె సిబ్బందికి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని ప్రకటన చేశారని, జిల్లాలో 95శాతం ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా అధికారులకు కిందిస్థాయి అధికారులు తప్పుడు సమాచారం అందిస్తున్నారని అన్నారు. డంగభద్రలోనే దాదాపు 15 వేల బస్తాల ధాన్యం కళ్లాల్లో నిల్వలు ఉన్నాయని, ఇవన్నీ అధికారులకు తెలియవా అని ప్రశ్నించారు. రైతులు గత నెల 15 రోజులుగా నూర్పు చేసి కళ్లాల్లో ధాన్యం నిల్వ ఉంచడం వల్ల ధాన్యం తేలికైపోతున్నాయన్నారు. వర్షం వస్తే ధాన్యం మొత్తం పాడైపోతాయన్నారు. అలాగే అనేక చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు భయాందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికే రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తే ప్రభుత్వం కొనకపోవడం దుర్మార్గమన్నారు. ఇదే అదునుగా ఇతర జిల్లాల నుంచి అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడానికి భేరసారాలు కూడా చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున రైతులను కదిలించే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



డంగభద్ర ఆర్‌బికె వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, టిడిపి నాయకులు



పార్వతీపురం: సంగంవలసలో ధాన్యం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలి

రైతుసంఘం, సిపిఎం డిమాండ్

పార్వతీపురంరూరల్: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇటీవల జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు, వై.సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని సంగంవలసలో పర్యటించి రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యపు నిల్వలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలు పూర్తయ్యాయని రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడం అన్యాయమని అన్నారు. ఆర్‌బికెల ద్వారా ప్రతి గింజా కొంటామని ఆర్భాటంగా ప్రటించిన ప్రభుత్వం హామీలకే పరిమితమైందన్నారు. ఇ-క్రాప్ ద్వారా రైతుల వివరాలు ప్రభుత్వం దగ్గరే ఉన్నప్పుడు ఇంత సరుకునిల్వల ఉన్నప్పటికీ సేకరణ పూర్తయ్యిందని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు దగ్గరే నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి స్థానిక ప్రజప్రతినిధులు చొరవ తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం తమ హామీ నిలబెట్టుకునేలా ఒత్తిడి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించకునేందుకు జిల్లాలో రైతులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజనసంఘ నాయకులు రావికోన సర్పంచ్ కె. రామస్వామి రైతు లు బడే ఉమాబాబు, బురిడి రామ్మూర్తి, బడే తాతబాబు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, సభ్యులు కోలక అవినాష్ కోరారు. గిరిజన ప్రాంతంలో చింతపండు, కరక్కాయలు, కొండ తామర తదితర అటవీ ఫల సాయాలు పెద్ద ఎత్తున లభ్యం అవుతున్నాయని, వీటిని భద్రపరచడానికి సరైన గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్మకాలు చేపట్టడానికి ఈ సరుకులు చెడిపోకుండా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సహకార సంస్థ తాము సేకరించిన చింతపండును చీపురుపల్లి, గజపతినగరం, రామభద్రపురం తదితర ప్రాంతాల్లో గల కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుతుందని దీంతో పెద్ద ఎత్తున లక్షలాది రూపాయలు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఈ కారణంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తే గిరిజన సహకార సంస్థకు ఖర్చు తగ్గుతుందని, అంతేకాకుండా ఈ ప్రాంత గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు.

విఆర్‌ఎలకు ఫేస్ యాప్ మినహాయించాలి

ప్రజాశక్తి - కురుపాం

విఆర్‌ఎలకు ఫేస్‌యాప్ హాజరు, బయోమెట్రిక్ మినహాయింపు ఇవ్వాలని విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్షులు గరుగుబిల్లి ఈశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వేతనాలతో కూడిన బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇచ్చి రూ.26వేలు వేతనం పెంచి అర్హతలు బట్టి ఉద్యోగోన్నతి కల్పించి నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 14న కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున జిల్లాలోని విఆర్‌ఎలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

సక్రమంగా విధులు నిర్వహించాలి : డిపిఒ

సాలూరురూరల్: పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వహించాలని జిల్లాపంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ, గ్రోపల్లి పార్వతి ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యదర్శి వారి పరిధిలో గల ప్రతి పనిని సక్రమంగా అనుకున్న సమయానికి పనులను, సేవలను నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి ప్రసాద్, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.


తోటపల్లి దేవస్థానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

తోటపల్లి దేవాలయ పునర్నిర్మాణానికి కృషి

కురుపాం : తోటపల్లి దేవస్థానం ఆలయ పునర్నిర్మాణానికి శాయశక్తుల కృషి చేద్దామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. శుక్రవారం తోటపల్లి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి దేవస్థానం తర్వాత ఈ ప్రాంతంలో చిన్న తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన దేవాలయం నేడు శిథిలావస్థలో ఉండడం బాధాకరమని, ఆలయ పునర్నిర్మాణానికి అంతా కలిసికట్టుగా శాయశక్తుల కృషి చేయాలని కోరారు. ఆయన వెంట జట్టు సంస్థ వ్యవస్థాపకుల డాక్టర్ డి.పారినాయుడు, దేవాలయ సిబ్బంది ,దేవాలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రమకు తగ్గ ఫలితం సంపాదించుకోవాలి

వీరఘట్టం : ఉపాధి వేతనదారులు శ్రమకు తగ్గ ఫలితం సంపాదించుకోవాలని ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని వండవలో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. సమయపాలన పాటించడంతో పాటు నిబంధన మేరకు పనులు చేయాలని సూచించారు. ఈయన వెంట ఎపిఒ జి.సత్యంనాయుడు ఉన్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని కిమ్మిలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్ఎస్ వర్మ పిల్లలకు, వృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు రక్తపోటు, మధుమేహ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ శాంతి కుమారి, టెక్నీషియన్ దినేష్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెడితే చర్యలు

వీరఘట్టం : పిల్లలను పనిలో పెడితే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై ఎం.హరికృష్ణ వ్యాపారస్తులను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు షాపులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. బాలలను పనిలో పెడితే చట్టరీత్యా నేరమ న్నారు. ఈ సందర్భంగా వ్యాపారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, విఆర్ఒలు జి.అప్పలనాయుడు, జి.సురేష్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రబీకి ఎరువులు పంపిణీ

భామిని : మండలంలోని బాలేరులో ఆర్‌బికెలో ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్ రైతులకు శుక్రవారం ఎరువులు పంపిణీ చేశారు. రబీ సీజన్లో పంటలు పండించే స్థానిక ఆర్‌బికెలో 450 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, ప్రభుత్వం నిర్దేశించిన ధర చెల్లించి యూరియా కొనుగోలు చేసుకోవచ్చునని, ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని విఎఎ ఆర్.జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పార్వతీపురంరూరల్ : అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పింఛన్ల తొలగింపుపై లబ్ధిదారులు ఆందోళన చెందనక్కర్లేదని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని జెమ్మిడివలస పంచాయతీ పరిధిలో శుక్రవారం జరిగిన గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. లబ్ధిదారులకు సంబంధించిన వివరాలున్న కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి రాజేంద్రకుమార్, ఎంపిపి శోభారాణి, జెడ్‌పిటిసి సభ్యులు రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, నాయకులు యాళ్ల ప్రతాప్, బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖరు, వై రమణమూర్తి, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితి బాగుంటే జీతాల చెల్లింపులో జాప్యమెందుకు?

పార్వతీపురం టౌన్ : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని వివిధ దినపత్రికల్లో వార్తలు వస్తున్నాయని, అటువంటప్పుడు పదో తేదీ అవుతున్నా ఉపాధ్యాయులకు జీతాలు ఎందుకు చెల్లించడం లేదో ప్రభుత్వం తెలియజేయాలని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం డిమాండ్ చేశారు. జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని, పన్నుల వసూళ్లతో ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందని పత్రికల్లో వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో చాలా వరకు ప్రభుత్వ శాఖలన్నింటికీ జీతాల చెల్లింపులు జరిగినప్పటికీ, విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం నేటికీ జీతాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల కాలంలో ప్రతినెలా జీతాలు ఆలస్యంగా చెల్లిస్తున్నందున నెలవారి జీతంపై ఆధారపడిన ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని సామల ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధ్యాయుల జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సామల కోరారు.

పిచ్చికుక్కల బారి నుంచి రక్షించాలి

పాచిపెంట : మండల కేంద్రంలో పిచ్చికుక్కల స్వైర విహారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, వాటి నుంచి ప్రజలను రక్షించాలని ఐద్వా, సిఐటియు నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు కె.సత్యవతి, సిహెచ్ సౌజన్య, కె.లక్ష్మి, జి.అప్పలనర్స మాట్లాడుతూ పాచిపెంటలో సుమారు 150 పైగా పిచ్చికుక్కలు ఉన్నాయని, దీనివల్ల చిన్న పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వెళ్లడానికి భయపడుతున్నారని అన్నారు. మూడు రోజుల క్రితం దాదాపు 18 మంది వీటి బారినపడ్డారన్నారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని దీనివల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కలగర్ల రమణమ్మ బొర్రా మురళి ఆ తదితరులు పాల్గొన్నారు

సచివాలయాల సందర్శన

సీతానగరం : మండలంలోన లచ్చయ్యపేట, అంటి పేట గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయాల సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ఉండాలన్నారు ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు, ఆయనతో పాటు ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

వీరఘట్టం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ చందక సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. మార్చి 13న జరగనున్న పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించినట్టు తహశీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ లక్ష్మునాయుడు, విఆర్ఒలు శ్రీను, చక్రి, సురేష్, అప్పలనాయుడు, సురేష్‌కుమార్ ఉన్నారు.

పాఠశాల సందర్శన

సీతంపేట: మండలంలోని కిరపలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంపిడిఒ కె.గీతాంజలి శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకున్నారు. విద్యార్థుల స్టాండర్డ్స్ గ్రేడింగ్ పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందుతున్నదీ, లేనిదీ పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడారు. అలాగే చెత్త సంపద కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పనిసరి



ప్రజాశక్తి -పార్వతీపురం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ఎన్నికల సంఘం ఫిబ్రవరి 9న శ్రీకాకుళం - విజయనగరం - విశాఖపట్నం పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు షెడ్యూల్ జారీ చేసిందని ఆయన చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున జిల్లాలో గల పోటీ చేయుచున్న అభ్యర్థులు, రాజకీయ ప్రతినిధులు ప్రవర్తనా నియమావళిలోని అంశాలను తు.చ తప్పకుండా పాటించాలని ఆదేశించారు.

ఎన్నికల నియమావళి వివరాలు

▶▶ పట్టభద్రుల నియోజకవర్గాలకు చెందిన ఏ విద్యా సంస్థ ప్రారంభోత్సవాలు / శంకుస్థాపనలు చేయకూడదు.

▶▶ అధికారిక సందర్శనను ఎన్నికల సంబంధిత పని/పర్యటనలతో కలపకూడదు.

▶▶ పోలింగ్ జరిగే నియోజక వర్గాల పట్టభద్రులను ప్రభావితం చేసే అవకాశం ఉన్న కొత్త విధానాలను, కార్యక్రమాలను గురించి ఎలాంటి ప్రకటన ఉండకూడదు.

▶▶ రాష్ట్ర శాసన మండలి ద్వైవార్షిక ఎన్నికలు జరుగుతున్న జిల్లాలోని ఎన్నికల సంబంధిత పనులకు సంబంధించిన ఏ ర్యాంకు అధికారిని, పట్టభద్రుల నియోజకవర్గాల్లోని విద్యాసంస్థల సమస్యలకు సంబంధించి మంత్రులు పిలిచే సమావేశాలకు హాజరు కావాలని పిలవకూడదు. ఎన్నికలు జరుగుతున్న పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి వ్యక్తిగత పర్యటనలో మంత్రిని కలిసిన ఏ అధికారి అయినా సంబంధిత సర్వీసు నిబంధనల ప్రకారం అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్లుగా పరిగణించబడుతుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 129 (1)లో పేర్కొన్న అధికారి అయితే, అతను అదనంగా ఆ సెక్షన్ యొక్క చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘించినట్లు పరిగణించబడుతుంది. దాని కింద పేర్కొనబడిన శిక్షార్హమైన చర్యకు బాధ్యత వహించవలసి ఉంటుంది.

▶▶ స్థానిక అధికారుల నియోజక వర్గంలోని ఓటర్లలో భాగమైన ఏ లోకల్ అథారిటీ సభ్యుడిని, ఏ మంత్రి (మంత్రి హోదాలో)ని ఏ అధికారిక సమావేశానికి/వీడియో కాన్ఫరెన్స్‌కు పిలవకూడదు. స్థానిక సంస్థల సాధారణ సమావేశాలు, అవసరమైనప్పుడు, జిల్లాకు సంబంధించిన జిల్లా ఎన్నికల అధికారి ముందస్తు అనుమతితో నిర్వహించవచ్చు.

▶▶ ఏ మంత్రి అయినా తన ఉనికిని ప్రస్ఫుటంగా కనిపించేలా ఏ రకమైన సైరన్లు, అతికించబడిన ఏదైనా రంగు లేదా బీకాన్ లైట్లు కలిగిన పైలట్ కార్లు లేదా కార్(లు) నియోజక వర్గానికి తన వ్యక్తిగత పర్యటన సమయంలో ఉపయోగించరాదు.

▶▶ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు, ప్రభుత్వ శాఖల్లో ఓటర్లను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేసే ఎటువంటి విధాన ప్రకటన లేదా కార్యక్రమం ప్రారంభించకూడదు.

▶▶ మైదానాలు మొదలగు బహిరంగ ప్రదేశాల్లో ఎన్నికల సమావేశాల నిర్వహణ, ఎన్నికల విషయంలో విమానాలు, హెలికాప్టర్ కోసం హెలీపాడు వినియోగించడానికి అధికారంలో ఉన్న పార్టీచే గుత్తాధిపత్యం చూపరాదు. First-cum-First serve ఆధారంగా ఇతర పార్టీలను, అభ్యర్థులను కూడా అనుమతించాలి.

▶▶ సమాచార సాంకేతిక వేదికను వినియోగించి, ఓటరును ప్రభావితం చేసే ఏ ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పథకాలు, పనులకు సంబంధించిన కొత్త మంజురులు జారీ చేయరాదు.

▶▶ స్టాటిక్ సర్వైలెన్స్ బృందాల మోహరింపు మినహా, శాసన మండలి ద్వైవార్షిక ఎన్నికల సమయంలో ధన బలం యొక్క ప్రతికూల పాత్రపై నియంత్రణ, నల్లధనం తరలింపును తనిఖీ చేయడానికి 29.05.2015న జారీ చేయబడిన స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానం వర్తించేలా చేయాలి.

▶▶ ద్వైవార్షిక ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల వ్యయ పర్యవేక్షణపై టీవీ ఛానెళ్లు/ కేబుల్ నెట్వర్క్‌లు, ప్రైవేట్ ఎఫ్ఎం ఛానెళ్లు, సినిమా హాళ్లు, ఆడియో సహ బహిరంగ ప్రదేశాల్లో, సామాజిక మాధ్యమాల్లోని దృశ్య ప్రదర్శనలు, ఎన్నికల ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ కోసం Compendium of instructionsలో సూచించిన విధంగా రాష్ట్ర, జిల్లా స్థాయి ఎంసిఎంసి నియమించబడాలి. ప్రచార సమయంలో రాజకీయ కార్యకర్తల సాధారణ ప్రవర్తనను కూడా పర్యవేక్షిస్తుంది.

▶▶ టివి ఛానెళ్లు / కేబుల్ నెట్వర్క్, ప్రైవేట్ టివి ఛానెళ్లతో సహ రేడియో, సినిమా హాళ్లు, పబ్లిక్ ప్లేస్, సోషల్ మీడియాలో ఆడియో విజువల్ డిస్ప్లేలు విషయంలో వలె ఎన్నికల ప్రచారంలో ఫోన్లో బల్క్ ఎస్ఎంఎస్‌లు/వాయిస్ సందేశాలు ఎన్నికల ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ పరిధిలో ఉండాలి. ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించిన ఇతర మోడ్‌లకు వర్తించే న్యాయపరమైన నిబంధనలు బల్క్ SMSలు/వాయిస్ సందేశాలకు కూడా వర్తిస్తాయి.

▶▶ సెక్షన్ 135సి ప్రకారం, ప్రజా ప్రాతినిధ్యం చట్టం లోని సెక్షన్-25లో నిర్వచించబడిన పోలింగ్ ప్రాంతాలలో "డ్రై-డే".. ప్రకటించాలి. ఇది శాసన మండలి నియోజకవర్గాల ఎన్నికలకు వర్తిస్తుంది.

▶▶ లోక్ సభ/శాసన సభలు ఎన్నికల సందర్భంలో వలె ప్రచార సమయంలో కాన్వాయ్ వాహనాల దుర్వినియోగం, నియంత్రణకు సంబంధించిన నిబంధనలు శాసన మండలి ఎన్నికలకు కూడా వర్తింపజేయబడతాయి.

▶▶ లోకసభ/శాసన సభల ఎన్నికల సందర్భంలో వలె ప్రచార వ్యవధి ముగిసిన వెంటనే అంటే, పోల్ ముగియడానికి 48 గంటల ముందు నియోజకవర్గంలో రాజకీయ కార్యకర్తలు ఉనికి కి సంబంధించిన నిబంధనలు శాసన మండలి ఎన్నికలకు కూడా వర్తింపజేయబడతాయి.

వీటితో పాటు ఎన్నికల కమిషన్ చే క్రింది వివరణలు ఇవ్వబడ్డాయి.

▶▶ హెలిప్యాడ్లు/సర్క్యూట్ హౌస్‌లు ఇతర ప్రదేశాల్లో ఓటర్లను ఉంచే పద్ధతి, ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపర్చడమే అవుతుంది. ఇది, సాధారణ ప్రవర్తనా నియమావళి లోని పేరా -1(4) మరియు ఐపిసి సెక్షన్ 171బి కింద ఉల్లంఘనగా పరిగణించబడుతుంది.

▶▶ ఏ రూపంలోనైనా అనగా గ్రాంట్-ఇన్-ఎయిడ్ వంటి ప్రభుత్వ సహాయం పొందుతున్న అన్ని సంస్థల గహాలు "విశ్రాంతి గహాలు/డాక్ బంగ్లాలు లేదా ఇతర ప్రభుత్వ వసతి గహాలు మరియు అతిథి గహాలు" అనే పదబంధం ఎంసిసి పేరా VII- (ii) కిందకి వస్తుంది.

జిల్లా ప్రజలకు సేవలు అందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ద్వారా ఈ ప్రాంత ప్రజలకు విశేష సేవలు అందించాలని కోరుతూ ఆయా సంస్థలకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం లేఖ రాశారు. సాధ్యమైనంత త్వరలో జిల్లా కేంద్రంలో ఈ సంస్థలను నెలకొల్పి ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలు కలిసిన పార్వతీపురం జిల్లా వెనుకబాటు తనంలో ఉన్నందున ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి, జిల్లా కేంద్రంలో ప్రసార భారతి వారి ఆలిండియా రేడియో సేవలను జిల్లాలో విస్తరించడంతో పాటు లోకల్ ఎఫ్ఎం రేడియో కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ జిల్లా ప్రజల సాంస్కృతిక కళలను, కళాకారులను ప్రోత్సహించి హరిజన, గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కేంద్ర డిప్యూటీ జనరల్ డైరెక్టర్, ప్రసార భారతి, బ్రాడ్కాస్టింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, చెన్నై వారిని కోరుతూ లేఖ రాశారు. అలాగే జిల్లా కేంద్రంలో ప్రధాన బ్యాంకింగ్ రంగ సంస్థ అయిన ఎస్‌బిఐ వారి రీజనల్ బిజినెస్ ఆఫీస్ ద్వారా ఈ ప్రాంత ప్రజలు సేవలు పొందేందుకు సుమారుగా 90 కిలోమీటర్లు మేర ప్రయాణం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. కావున బొబ్బిలిలో గల స్టేట్ బ్యాంక్ బిజినెస్ ఆఫీస్‌ను పార్వతీపురానికి తరలించాలని కోరుతూ స్టేట్ చీఫ్ జనరల్ ఎస్‌బిఐ, అమరావతి వారిని తన సిఫార్సు లేఖ ద్వారా తెలిపారు. అలాగే టౌన్, బెలగాం రైల్వే స్టేషన్లో మీదుగా ప్రయాణిస్తున్న 28 ఎక్స్ప్రెస్ రైళ్లను వేర్వేరు స్టేషన్లో ఆపడం వలన ప్రయాణికులు కొంత మేర తికమకకు గురవ్వడంతో పాటు అసౌకార్యానికి లోనవుతున్నారని, కావున ఇకపై పార్వతీపురం స్టేషన్లోనే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలనికోరారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే చీఫ్ ప్యాసింజర్స్ ట్రాన్స్పోర్టేషన్ మేనేజర్, భువనేశ్వర్ జోన్ వారికి లేఖ రాశారు.

కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పని చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. స్థానిక మున్సిపాల్టీ పరిధిలో గల ప్రజా ప్రతినిధులు, సచివాలయం కన్వీనర్లతో శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చిన మూడున్న రేళ్లలో 95 శాతం పైబడి హామీలను నెరవేర్చామన్నారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా అయినా లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. కొన్ని కుటుంబాలకు లక్షల రూపాయల్లో ఆర్థిక సహాయం చేసి వారి జీవన స్థితిగతులను ప్రభుత్వం మార్చిందన్నారు. కావున ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు అంతా కలిసి పట్టణంలోని పార్టీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సాధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. అందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎమ్మెల్యే దిశనిర్దేశం చేశారు. సచి వాలయ కన్వీనర్లు గృహ సారథులతో కలిసి వాలంటీర్ల సహాయంతో ప్రతి లబ్ధిదారని ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన సహాయ, సహకారాలను పథకాలను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో తెలియచేసి వారి దీవెనలు పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇండుపూరు గుణేశ్వర రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, ఎఎంసి వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు, 30 వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వార్డు సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

రక్తహీనతను అధిగమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గర్భిణులు, బాలింతలు, శిశువులు, కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించి రక్తహీనతను అధిగమించే దిశగా కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. పట్టణంలోని 23, 24 వార్డులకు చెందిన 14వ సచివాలయంలో నిర్వహించిన పట్టణ ఆరోగ్య పారిశుధ్యం, పోషకాహార కమిటీ సమావేశానికి హాజరై, ఆరోగ్యం, పోషకాహారం, పారిశుధ్యం అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. ప్రసూతి సంరక్షణ, పోషణ, ఐరన్, కాల్షియం మాత్రలు షెడ్యూల్ ప్రకారం వేయడం, ఆసుపత్రిలో ప్రసవాలు, తదుపరి బాలింతల ఆరోగ్య పర్యవేక్షణ, హెచ్‌బిఎన్‌సి కిట్లను ఉపయోగించి నవజాత శిశువులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పర్యవేక్షణ, షెడ్యూల్ ప్రకారం టీకా నిర్వహణ చేసి నివేదికలను రికార్డుల్లో నమోదు, టీకా పడని పిల్లల గుర్తింపు, 10 - 19 ఏళ్ల మధ్య వయస్సు బాలికల్లో ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత నివారణ, యుక్త వయస్సు వివాహాలు, తద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, డ్రై డే కార్యక్రమాల నిర్వహణ అందులో లేవనెత్తిన సమస్యలు, పరిష్కారాలు మొదలైన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డిపిఒ లీలారాణి, వార్డు సెక్రటరీ కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఎఎన్ఎం విజయ, అంగన్వాడీ సిబ్బంది కృష్ణకుమారి, గౌరీమణి, ఎన్‌జిఒ ఈశ్వరరావు, ఆశా కార్యకర్తలు శివాని, కృష్ణవేణి పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

సారా అమ్మకాలపై ఉక్కుపాదం : సిఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో నాటు సారా అమ్మకాలను నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎల్విన్ పేట సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సారా అమ్మకాలు, తయారీపై ఒరిస్సా సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎక్కడైనా నాటు సారా తయారీ, అమ్మకాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన గ్రామాల్లో గ్రామ సచివాలయ పోలీసులను, మహిళా సంఘాలను, యువజన సంఘాలను తరచూ తాము కలుస్తున్నామని, వీరి ఇచ్చిన సమాచారం మేరకు ఏజెన్సీ ప్రాంతంలో నాటు సారా నిర్మూలనకు కషి చేస్తున్నామని సిఐ సత్యనారాయణ తెలిపారు.

రబీ సాగును ఇ-పంట నమోదు చేయాలి

సీతానగరం : రబీ సాగు విస్తీర్ణాన్ని ఇ-పంట నమోదు చేయాలని వ్యవసాయ సలహా మండలి కన్వీనర్ పోల ఈశ్వరనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ముందు వ్యవసాయ సిబ్బంది రబీ సాగును ఇ-క్రాప్ చేయాలన్నారు. అవసరమైన మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు మరో రెండు, మూడు రోజుల్లో సమయం పడుతుందన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతుల వివరాలను సేకరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ గాయపడ్డ సంఘటన శుక్రవారం జరిగింది. కొమరాడ మండలం గంగరేగువలసకు చెందిన పుర్రు హరికృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌పై వెళ్లి పనులు ముగించుకుని తిరిగివస్తుండగా, సివిని వద్ద ఆర్‌డిఒ కార్యాలయ ప్రాంతంలో రాయగడ వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో త్రుళ్లిపడి ట్రాక్టర్ కేబిన్‌పై పడడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

బంధువుల దాడిలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం పట్టణంలోని పెదమాదిగ వీధికి చెందిన కురమాన సురేష్, అన్నపూర్ణపై అదేవీధికి చెందిన తమ బంధువులు దాడిచేయడంతో గాయపడిన సంఘటన శుక్రవారం జరిగింది. తమ కుమార్తె గంటా ప్రతాప్‌ను ప్రేమించి పెళ్లిచేసుకున్న కారణంగా ఇరుకుటుంబాల మధ్య స్పర్ధలు నెలకొన్నాయి. శుక్రవారం ప్రతాప్, బాలు, ప్రవీణ్‌బాబు కలిసి అత్తామామలపై దాడిచేయడంతో గాయపడ్డారు. స్పందించిన స్థానికులు, ఆటోలో జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రక్తహీనత నివారణపై అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

రక్తహీనత నివారణకు గ్రామాల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. గత నెలలో ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరిగాయని వైద్యాధికారులను ప్రశ్నించగా 19 ప్రసవాలు జరిగాయని, అందులో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగినట్లు వైద్యాధికారులు వివరణ ఇచ్చారు. మరిన్ని ఎక్కువ ప్రసవాలు సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి సిబ్బందిని ఆదేశించారు. పది నుండి 19 ఏళ్ల బాలబాలికల రక్తహీనత నివారణకు కృషి చేయాలని సూచించారు. సిడి, నాన్ సిడి సర్వే విస్తతంగా చేయాలని రక్తపోటు, మధుమేహంపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం పక్కాగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మందుల నిల్వ, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యులు మానస, నితీశా, డెమో వై.యోగేశ్వర్‌రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ఒ.చినబాబు, సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

ఇంటి పన్నుల వసూలు పూర్తిచేయాలి

సీతానగరం : ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని ఇంటి పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అలాగే నులుపురుగు మందులు, ఫైలేరియా సర్వే ఉంటే ఇవ్వాలని, వాలంటీర్ల ద్వారా చేయించడం చేయాలన్నారు, సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఎఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : శత్రుచర్ల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగించడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధి కల్పన కరువైందని, నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఒకవైపు ఏనుగులు, మరోవైపు పెద్దపులి, వైసిపి నాయకులు బెడద ఎక్కువైందని విమర్శించారు. యువత సంక్షేమం కోసం నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రకు ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తుందని అన్నారు. యువత, మహిళలు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. ప్రజా సంక్షేమం, ఉపాధి కల్పన టిడిపితోనే సాధ్యం అవుతుందన్నారు. కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో టిడిపికి రోజురోజుకు బలం పెరుగుతుందన్నారు. వైసిపి పాలన పట్ల ప్రజలు పూర్తిగా అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. టిడిపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కొంతమంది వైసిపి నాయకులు భయపెట్టే పరిస్థితి ఉందని అన్నారు. ఇదేం కర్మ కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీలో, గ్రామాల్లో నిర్వహించాలని ఆమె కోరారు. 2024 ఎన్నికల్లో కురుపాం లో టిడిపి జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమానికి ముందు గుమ్మలక్ష్మీపురం పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందివాడ కృష్ణబాబు, వెంపటాపు భారతి, కద్రక కళావతి, కిల్లక దాసు పలు పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

సాలూరు: రాష్ట్రంలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ విమర్శించారు. శుక్రవారం ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆమె మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్‌తో కలిసి పట్టణంలోని 21వ వార్డులో పర్యటించారు. టిడిపి కౌన్సిలర్ బందాపు సీతమ్మ, వార్డు నాయకులు బి.సతీష్ ఆధ్వర్యాన వారికి ఘనస్వాగతం పలికారు. వార్డులో ఏ సమస్యను పరిష్కరించడం లేదని కౌన్సిలర్ సీతమ్మ సంధ్యారాణి, భంజ్ దేవ్‌కు చెప్పారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు లేవు, చేయాల్సిన పనులు ఉన్నా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అల్లు అప్పయ్యమ్మ, కౌన్సిలర్ వైదేహి కృష్ణారావు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు